సాక్షి ఒడిశా

శనివారం ◆ 29 ◆ మార్చి ◆ 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,86,369
బంగారం : 1 గ్రాము 200 మిల్లీ గ్రాములు
వెండి : 98 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



ఉత్సాహంగా ఉగాది..
ఉగాది పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పలు పోటీలు నిర్వహించారు.
- IIలో



నాటక దినోత్సవం
పర్లాకిమిడిలో నాటక దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- IIలో

కాంగ్రెస్ బల ప్రదర్శన

- మహిళల భద్రత నినాదంతో భారీ ఉద్యమం
- ఘంటానాదంతో పాదయాత్ర



ఘంటానాదంతో రాష్ట్ర కాంగ్రెస్ సభ్యుల పాదయాత్ర

భువనేశ్వర్:

రాష్ట్రంలో కాంగ్రెస్ తన ఉనికిని బలపరచుకునే దిశలో సరికొత్త పంథాలో బల ప్రదర్శన చేస్తోంది. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల తర్వాత శాసన సభ ముట్టడి తొలి ఉద్యమంగా కనిపించింది. దీర్ఘకాలం తర్వాత కాంగ్రెస్ ఈ తరహాలో భారీ ఉద్యమానికి శంఖారావం చేయడం విశేషం. ప్రధానంగా భక్త చరణ్ దాస్ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని బాధ్యతలు చేపట్టిన నుంచి పీసీసీ కార్యాచరణ వాడీవేడిగా కొనసాగుతుంది.

మహిళల భద్రత నినాదంతో శాసన సభ లోపల, బయట తీవ్ర స్థాయిలో విజృంభించి అలజడి రేపింది. ఈ నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలపై స్పీకరు సురమా పాఢి సస్పెన్షన్ వేటు వేశారు. అంచెలంచెలుగా సభలో కాంగ్రెస్ సభ్యులు అందరిని సభా కార్యకలాపాల నుంచి దూరం చేశారు. సభలో కాంగ్రెస్ బలం 14 మంది సభ్యులు కాగా వీరందర్ని స్పీకరు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. త్వరలో సభలో బడ్జెటు సమావేశాలు ముగియనున్నాయి. ఈ లోగా కాంగ్రెస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు తొలగించే అవకాశాలు కనిపించడం లేదు. 14 మంది సభ్యుల వ్యతిరేకంగా క్రమశిక్షణ చర్యల కింద స్పీకరు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడంతో సభ కాంగ్రెస్ శూన్యంగా మారింది. ఈ చర్యని అప్రజాస్వామిక చర్యగా ప్రభావిత కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. పార్టీ సభ్యుల సస్పెన్షన్ వ్యతిరేకంగా చేపట్టిన శాసన సభ ముట్టడి ఆందోళన తారస్థాయికి చేరింది.

పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య హోరాహోరీ పోరు చోటు చేసుకుంది. ఇరు వర్గాలు ఒకరిపై వేరొకరు రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపించుకుంటున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాత్రింబవళ్లు నిరసన సందర్భంగా పోలీసులు రాష్ట్ర శాసన సభ లోనికి ప్రవేశించడం రాష్ట్ర శాసన సభ చరిత్రలో కళంకం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరమైన కట్టుబాట్లను అధిగమించి విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై కాంగ్రెస్ కార్యకర్తలు మారణాంతక దాడికి పాల్పడ్డారని రాష్ట్ర పోలీసు వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హింసాత్మక చర్యలకు పాల్పడిన వారి వ్యతిరేకంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం తథ్యమని పోలీసులు బాహాటంగా హెచ్చరించారు.

స్థానిక క్యాపిటల్ పోలీస్ ఠాణాలో కాంగ్రెస్ ఆందోళనకారుల వ్యతిరేకంగా 3 వేర్వేరు ఫిర్యాదులు (ఎఫ్ఐఆర్) శుక్ర వారం నమోదు చేశారు. ఈ నెల 26న శాసన సభ తూర్పు ప్రవేశ మార్గం ఆవరణలో కాంగ్రెస్ సభ్యుల ఆందోళన వ్యతిరేకంగా ఒక కేసు నమోదు కాగా ఈ నెల 27న శాసన సభ ముట్టడి పురస్కరించుకుని పోలీసు వాహనాలకు నిప్పు అంటించిన ఆరోపణ కింద మరో కేసు నమోదు చేశారు. శాసన సభ ముట్టడి ఆందోళనలో శాంతిభద్రతలకు భంగం కలిగించిన ఆరోపణ కింద మూడో కేసు నమోదు చేశారు. ఈ చర్యని రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖుడు భక్త చరణ్ దాస్ పక్షపాత చర్యగా వ్యాఖ్యానించారు. పోలీసుల ఆరోపణ ప్రకారం రాళ్లు రువ్వి పోలీసుల్ని గాయపరచిన వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు లేరని ఆయన స్పష్టం చేశారు. పలువురు కాంగ్రెసేతర వర్గాలు ఈ ఆందోళనలో కలిసిపోయిన విషయాన్ని పోలీసు వర్గాలు విస్మరించి ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ కార్యకర్తల వ్యతిరేకంగా కేసులు బనాయించడం అన్యాయమని పేర్కొన్నారు.

పోలీసుల చర్యలతో వెనుకంజ వేసేది లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నిర్విరామంగా కృషి చేస్తుందని ఆయన ప్రకటించారు. ఆయన పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన 45 రోజుల స్వల్ప వ్యవధిలో శాసన సభ ముట్టడి ఆందోళన చేపట్టి రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర అలజడి రేపారు. 2000 నుండి 2024 వరకు వరుసగా ఆరు ఎన్నికల్లో కాంగ్రెస్ నిరుత్సాహ ఫలితాలతో కార్యకర్తల వర్గం నిరుత్సాహం చెందింది. తాజా ఆందోళనతో కార్యకర్తల్లో కొత్త చురుకుదనంతో పోరాట స్ఫూర్తిని బలోపేతం చేసినట్లు రాష్ట్ర పీసీసీ కొత్త కార్యవర్గం గట్టి నమ్మకం వ్యక్తం చేస్తుంది. ఉనికిని బలపరచుకునే దిశలో కాంగ్రెస్ నిరవధికంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

కొత్త ఉత్తేజం

శాసన సభలో దీర్ఘకాలంగా బలం దిగజార్చుకున్న కాంగ్రెస్ భావి ఎన్నికల్లో బలం పుంజుకునేందుకు తాజా ఆందోళన దోహదపడుతుందని రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల వాటా 13.4 శాతానికి దిగజారి కేవలం 14 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఓట్ల వాటా పెంపొందించేందుకు పార్టీ కొన్ని అత్యవసర చర్యలతో వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తు కార్యకర్తల్లో ఉత్త ఉత్తేజం ప్రేరేపిస్తుందన్నారు. కాంగ్రెస్‌లో సప్తగిరి ఉలాకా, నబజ్యోతి పట్నాయక్, సాగర్ చరణ్ దాస్, సోఫియా ఫిరదౌస్, మంగు ఖిలాతో మరికొంత మంది యువ నాయకుల్లో నాయకత్వ నైపుణ్యాలకు రాష్ట్ర కాంగ్రెస్ పదును పెడుతుంది. భక్త చరణ్ దాస్ నేతృత్వంలో 2025 సంవత్సరంలో కాంగ్రెస్ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ శిబిరంలో కొత్త ఉత్సాహం ఉరకలేస్తుంది.

కొనసాగుతున్న నిరసన

ఒక వైపు శాసన సభలో ప్రవేశం లేకుండా సస్పెన్షన్‌కు గురైన సభ్యులు శుక్రవారం నగరంలో దేవాలయాలు సందర్శించి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సర్కారుకు మహాదేవుడు సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ భవన్ నుంచి ఘంటానాదంతో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో పాదయాత్ర నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాహుల్ గాంధీతో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా భేటీ



పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీతో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా

కొరాపుట్: ఒడిశా రాష్ట్ర పరిస్థితులను రాహుల్ గాంధీకి కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా వివరించారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో రాహుల్‌తో ఉల్కా భేటీ అయ్యారు. ప్రస్తుతం ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపడంలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందన్నారు. గత 25 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ క్యాడర్ భారీస్థాయిలో విరుచుకుపడడంపై బీజేపీ ప్రభుత్వం వణుకు పుట్టించిందన్నారు. మహిళలపై అత్యాచారాలు, అసెంబ్లీలో కాంగ్రెస్ పోరాటం, అసెంబ్లీ ముట్టడి, నెత్తురు చిందించిన కాంగ్రెస్ కార్యకర్తల పోరాటం వివరించారు.

విజిలెన్స్ వలలో అంగన్‌వాడీ సూపర్ వైజర్



అంగన్ వాడీ సూపర్ వైజర్ రేణుక పట్నాయిక్

కొరాపుట్: విజిలెన్స్ వలకు అంగన్‌వాడీ సూపర్ వైజర్ చిక్కారు. శుక్రవారం కొరాపుట్ విజిలెన్స్ విభాగం ఈ వివరాలు ప్రకటించింది. జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి బుర్జ గ్రామంలో అంగన్ వాడీ సూపర్ వైజర్ రేణుక పట్నాయిక్ రు.50 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. తన పరిధిలో పని చేస్తున్న అంగన్ వాడీ వర్కర్ డబ్బులు డిమాండ్ చేశారు. దాంతో అంగన్‌వాడీ వర్కర్ విజిలెన్స్ విభాగాన్ని సంప్రదించి పట్టించారు. అనంతరం అరెస్ట్ చేసి జైలుకి తరలించారు.

కాశీనగర్ రైల్వేట్రాక్ వద్ద మృతదేహం



కాశీనగర్ రైల్వే స్టేషన్ ట్రాక్ వద్ద పడి ఉన్న మోహన రావు మృతదేహం

పర్లాకిమిడి: కాశీనగర్ రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం ఒకరు రైలు కింద పడి మృతి చెందినట్టు రైల్వే పోలీసు అధికారులు తెలియజేశారు. మృతుడు కాశీనగర్ సమితి ఖండవ పంచాయతీలో పురుటిగుడ గ్రామానికి చెందిన మోహన రావు (40)గా పోలీసులు గుర్తించారు. శుక్రవారం వేకువజామున గుణుపురం నుంచి పూరీ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుబండి కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల సమాచారం. కాశీనగర్‌లో శివ మోటారు గ్యారేజీ బావమరిది అయిన మోహనరావుకు భార్య ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు వారి బంధువులు చెబుతున్నారు. రైల్వే పోలీసులు కేసును యూడీ కింద నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం పర్లాకిమిడి ప్రభుత్వ మెడికల్‌కు తరలించారు.

బ్యాంకు ఉద్యోగి అనుమానాస్పద మృతి



ప్రకాశ్ కుమార్ మహారాణ మృతదేహం

పర్లాకిమిడి: గజపతి జిలా మోహన బ్లాక్ చంద్రగిరిలో ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగి తన నివాస గృహంలో అనుమానాస్పదంగా మృతి చెందినట్టు చంద్రగిరి పోలీసులు శుక్రవారం గుర్తించారు. మృతుడు భువనేశ్వర్‌కు చెందిన ప్రకాష్ కుమార్ మహారాణా (33)గా పోలీసులు గుర్తించారు. ఆయన బ్యాంకుకు శుక్రవారం విధులకు రాకపోవడంతో తోటి ఉద్యోగులు బ్యాంకు మేనేజరుకు ఫిర్యాదు చేశారు. అయితే ఆయన నివాస గృహానికి వెళ్లి ఫోన్ చేసినా రాకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాష్ కుమార్ మహారాణా తన గదిలో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఫిబ్రవరి మాసంలో ప్రకాష్ కుమార్ చంద్రగిరి బ్యాంకులో జాయిన్ అయ్యాడు. మృతుని బంధువులకు పోలీసులు సమాచారం అందజేసి, శవాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసును చంద్రగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా కళాశాలలో న్యాయ అవగాహన శిబిరం



న్యాయ సచేతన శిబిరంలో మాట్లాడుతున్న సుమన్ జెన

జయపురం: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు శుక్రవారం న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. శిబిరంలో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగాలలో, ఇతర పనులలో ఉండే మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలు పైన,వాటి నివారణ చట్టాలపైన వివరించారు. బాధిత మహిళలకు చట్టపరిధిలో లభించే సహాయాలు వివరించారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో లైంగిక దాడుల నివారణ, వాటి పరిష్కారం తదితర విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిలర్ కె.దివాకర రావు, హరిశ్చంద్ర ముదులి, అసిస్టెంట్ డిప్యూటీ టీగల్ ఆండ్ డిఫెన్స్ కౌన్సిలర్ గీతాంజలీ ధల్, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ వివేకానంద సున, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డొంబురు దొర దాస్, డాక్టర్ దిగాల్ తదితరులు పాల్గొన్నారు.

గోహత్య నిషేధం బిల్లు అమలు చేయాలని డిమాండ్



కలెక్టరేట్‌కు నినాదాలు చేస్తూ వెళ్తున్న వీహెచ్‌పీ, భజరంగదళ్ సభ్యులు

పర్లాకిమిడి: ఒడిశా గోహత్య నిషేధం బిల్లు 2024ను అమలు చేయాలని, గోవుల అక్రమరవాణా అరికట్టాలని, గోశాలలు నిర్మించాలని విశ్వహిందూ పరిషద్, భజరంగ్ దళ్ శ్రేణులు కలెక్టరేట్ ఆవరణలో నినాదాలు చేశారు. అనంతరం గవర్నర్‌కు ఉద్దేశించి రాసిన వినతిని కలెక్టర్ బిజయకుమార్ దాస్‌కు జిల్లా గోరక్షణ పర్యవేక్షకులు లోకనాథ్ మిశ్రా, పరలా ధర్మ ప్రచారక ప్రేమీ సత్యానారాయణ సాహు, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షులు కైలాష్ చంద్ర గౌడో అందజేశారు. ఈ ఆందోళనలో వి.హెచ్.పి. కోశాధికారి హరిమోహన్ పట్నాయిక్, సౌమ్యరంజన్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ గేటు వద్ద వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ శ్రేణులు

మూడు రోజులకే మూలకు..?



మూలకుచేరిన ఏసీ బస్సులు

జయపురం: ముఖ్యమంత్రి బస్సు సేవా పథకంలో భాగంగా మూడు రోజుల క్రితం ప్రవేశపెట్టిన 50 సీట్ల ఏసీ బస్సులు అప్పుడే మూలకు చేరాయి. ఈ బస్సులు నడపడంపై రాష్ట్ర ప్రైవేట్ బస్సుల యాజమాన్య అసోసియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసిందని, దీంతో తర్వాత ఉత్తర్వులు విడుదల చేసేవరకు బస్సులను నిలిపి వేయాలని ఒడిశా స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఓఎస్‌ఆర్టీసీ)ని ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా జయపురం పాత బస్టాండ్‌లో 7 ఏసీ బస్సులు నిలిపివేశారు. గతంలో లక్ష్మి ఏసీ బస్సులు సెమిలిగుడ ప్రభుత్వ బస్టాండ్‌లో పడి ఉండేవి. అయితే ముఖ్యమంత్రి బస్సుసేవా పథకంలో వీటిని మూడు రోజుల క్రితం గుణుపూర్‌కు రెండు బస్సులు, జయపురం–కాశీపూర్, జయపురం– మల్కన్‌గిరి, జయపురం–కలహండి(కెటాగాం), జయపురం –కొటియా, జయపురం – భవానీపట్నలకు నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ మరలా నిలిపివేయడంతో సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

జయపురం: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలని జయపురం బ్లాక్ ఎడ్యు కేషన్ అధికారి చందన కుమార్ నాయిక్ అన్నారు. విద్యార్థుల్లో నిఘూడమై ఉన్న ప్రతిభ ప్రతిబింబించేది ఉత్సవాల్లోనేనని.. అందుకే ప్రతి పాఠశాలలో వార్షికోత్సవాలు జరుపుతారన్నారు. స్థానిక గాఢవీధి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని సబితా బెహర అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. విద్యార్థులు మనసు పెట్టి చదువుకోవాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలని ఉద్బోధించారు. గౌరవ అతిథిగా అదనపు బీఈవో కైలాస చంద్రశతపతి, సీఆర్‌సీసీ జ్యోతీ శంకర త్రిపాఠీ, జయపురం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు త్రినాథ్ సింగ్‌లాల్, సీనియర్ న్యాయవాది శశి పట్నాయక్, లక్ష్మీ కుమారి పట్నాయక్ పాల్గొన్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

జీతభత్యాల పెంపుదలకు ఎమ్మెల్యేల డిమాండ్

భువనేశ్వర్: జీతభత్యాలు పెంచాలని రాష్ట్ర శాసన సభ సభ్యులు డిమాండ్ చేశారు. భారత పార్లమెంటు సభ్యుల జీతభత్యాలు, పింఛన్ పెంచారు. ఈ తరహాలో రాష్ట్రంలో సిటింగు ఎమ్మెల్యేల జీతభత్యాలు, మాజీల పింఛన్ పెంచాలని జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపాదించారు. శుక్రవారం జీరో అవర్‌లో ప్రధాన ప్రతిపక్షమైన బిజూ జనతా దళ్ శాసన సభలో ఎమ్మెల్యేల జీతభత్యాలతో మాజీ శాసన సభ్యుల ఫింఛను పెంచాలని డిమాండ్ చేశారు. సభలో ఈ అంశంపై ప్రస్తావన పురస్కరించుకుని ద్రవ్యోల్బణం, అధిక వైద్య ఖర్చుల దృష్ట్యా జీతం మరియు ఫించను పెంచడం అవసరమని విపక్ష బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసన సభ్యుల జీతభత్యాలు, పింఛన్ పెంపుదల నేపథ్యంలో ఉదాలా నియోజక వర్గం ఎమ్మెల్యే భాస్కర్ మఢెయి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యేల జీతం, మాజీల పింఛన్ సవరణకు సిఫార్సులతో ఈ కమిటి తన నివేదికను సమర్పించిందని ప్రమీలా మల్లిక్ గుర్తు చేశారు. కమిటీ సిఫార్సులను ఆమోదించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యేల జీతాలను చివరిసారిగా 2017 సంవత్సరంలో పెంచారు. దీర్ఘకాలంగా వీరి జీతభత్యాలు పెరుగుదలకు నోచుకోలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యేల జీతభత్యాలతో మాజీల ఫించను పెంచడం అనివార్యంగా పేర్కొన్నారు. ప్రతిపక్ష డిప్యూటీ చీఫ్ విప్ ప్రతాప్ కేశరి దేబ్ కూడా ఇదే తరహాలో ఎమ్మెల్యేల జీతం, పింఛను పెంపును సిఫార్సు చేసే కమిటీ నివేదికను అమలు చేయడానికి ప్రభుత్వం త్వరిత చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

దంపతుల ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న మృతదేహాలు

కొరాపుట్: ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించకపోవడంతో నవ దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నబరంగ్‌పూర్ జిల్లా దాబుగాం పోలీసుస్టేషన్ పరిధి జెట్టియా గ్రామానికి చెందిన దినా జాని (20), జొరిగాం పోలీసుస్టేషన్ పరిధి డొక్నికి గ్రామానికి చెందిన పుర్ణిమా బేగ్(19)లు నెల రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వీరి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. దీంతో మనస్థాపానికి గురైన దంపతులు దాబుగాంలోని వారి నివాసంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేశారు.

లైంగికదాడిపై కేసు నమోదు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితిలో గత శివరాత్రి ఉత్సవాల మరుసటి రోజు ఓ 14 ఏళ్ల బాలికను నలుగురు యువకులు ఇంటి ముందు నుంచి బైక్‌పై కిడ్నాప్ చేసి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాలిక కుటుంబ సభ్యులు గురువారం కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కోరుకొండ ఐఐసీ హిమాంశు శేఖర్ బారిక్ ఆదేశాలతో ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే ఈ నలుగురు యువకులు పరారీలో ఉన్నారని గుర్తించారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

పర్లాకిమిడిలో భగభగ



పర్లాకిమిడిలో శుక్రవారం పొగమంచు



ఎండల్లో గొడుగులు వేసుకుని బయలుదేరుతున్న వ్యవసాయదారుడు

పర్లాకిమిడి: గత వారం రోజులుగా గజపతి జిల్లాలో గురండి, పర్లాకిమిడి, కాశీనగర్, రాయగడ బ్లాక్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గురువారం పగటిపూట 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, శుక్రవారం ఉదయం పొగమంచు, మధ్యాహ్నం 30 డిగ్రీల ఉష్ణోగ్రతలను ప్రజలు చవిచూశారు. ఇతర జిల్లాల్లో కాలవైశాఖి తాండవం చేసినా గజపతి జిల్లాలో వర్షం కురవలేదు. దీంతో వృద్ధులు, ప్రయాణికులు పర్లాకిమిడి వచ్చేందుకు భయపడుతున్నారు.

రేషన్ సరుకుల పంపిణీ సమయాల మార్పు

- రేషన్ డిపోల వద్ద అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో వేసవి తాపం పుంజుకుంటుంది. వడగాడ్పులు తీవ్రం అవుతున్నాయి. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకుల పంపిణీ సమయాలను సవరించింది. ఎండ తక్కువగా ఉన్న వేళల్లో సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో రేషన్ సరుకులు తీసుకోవచ్చు. అలాగే చౌక ధరలదుకాణాల ప్రాంగణాల్లో వినియోగదారుల సౌకర్యం కోసం ఛాయా శిబిరాలు ఏర్పాటు అవుతాయి. ఈ శిబిరాల్లో వడ దెబ్బ నివారణకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది.

సరుకులు పంపిణీ వేళలు

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ఆధ్వర్యంలో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వినియోగదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేస్తారు. వినియోగదారులు ఎండతో ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సవరించిన సమయాల్లో రేషన్ సామగ్రిని సజావుగా సరఫరా చేయడానికి ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది. లబ్ధిదారులు తమకు అవసరమైన సామగ్రిని సమర్థవంతంగా పొందేలా చూసుకోవడానికి ఈ వేళలను పాటించాలని ఆహార సరఫరాల శాఖ అభ్యర్థించింది. వేడి సంబంధిత ఒత్తిడి నుంచి చౌక ధరల దుకాణాల ప్రాంగణంలో రక్షణ కల్పించేందుకు తాత్కాలిక ఆశ్రయాల ఏర్పాటు అవుతాయి. ఈ ప్రాంగణాల్లో సురక్షితమైన తాగు నీరు, ఓరల్ రీహైడ్రేషన్ లవణాలు (ఓఆర్‌ఎస్) ప్యాకెట్లు పంపిణీ చర్యల్లో శాఖ మార్గదర్శకాలను అనుసరించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీని అమలు విజయవంతంగా జరిగేలా చూసేందుకు ఈ విధానాలను పర్యవేక్షించే బాధ్యత ఆహార సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు.

ఘనంగా నాటక దినోత్సవాలు



మాట్లాడుతున్న కళాకారులు

జయపురం: స్థానిక గీతాంజలి కల్యాణ మండప ప్రాంగణంలో కొరాపుటియ కళలు, కళాకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నాటక దినోత్సవాలు నిర్వహించారు. ప్రముఖ నాటక కళాకారుడు గోవింద చంద్ర సాహు ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో ముందుగా ఇటీవల అకాల మరణం చెందిన బాల కళాకారిణి సంతోషిణీ తరాశియకు నివాళులర్పించారు. జయపురం నాటక గత చరిత్ర, నేటి పరిస్థితి, భవిష్యత్‌లో నాటక కళను విస్తరింపజేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కళాకారులు సత్య మిశ్ర, గోపాల కృష్ణ సామంత రాయ్, సుధాకర పట్నాయిక్, రవీంద్ర పాత్రోలు మాట్లాడుతూ.. నాటక ప్రదర్శనలు సమాజ చైతన్యానికి దోహదపడతాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంగీత కళాకారుడు ధిరెన్ మోహన్ పట్నాయక్, కళాకారులు మనోజ్ కుమార్ పాత్రో, జయపురం ఆకాశవాణి విశ్రాంత అధికారి నరేంద్రనాథ్ పట్నాయక్, జయంత శాంత, గుప్తేశ్వర పాణిగ్రాహి, రఘునాథ్ బిశ్వాల్, సత్యనారాయణ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



నాటకోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం


పైపుల ద్వారా తాగునీరు వస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలోని బందుగాం సమితి గిరిడి గ్రామంలో సాగునీటి సమస్య పరిష్కారమైందని జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక తెలిపారు. ఈనెల 22వ తేదీన ఆమె వాహనాన్ని గ్రామస్తులు అడ్డగించడంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టింది. శుక్రవారం ఉదయం గ్రామానికి తాగునీటి పైపుల ద్వారా నీరు వచ్చింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

7 నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 7 నుంచి ప్రారంభించనున్నట్లు అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ పి.పద్మారావు తెలిపారు. పరీక్షల నిర్వహణ కేంద్రంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 21 వరకు పరీక్షలు జరుగుతాయని 53 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఫిబ్రవరిలో జరగాల్సిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు మే చివరి వారంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ రెండో సెమిస్టర్ ఫీజులు స్వీకరిస్తున్నామని, ఏప్రిల్ 5లోపు అదనపు రుసుం లేకుండా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

యువకుడు అరెస్టు


అరెస్టయిన యువకుడితో పోలీసులు

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురంలో మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి ప్రయత్నించిన యువకుడిని అరెస్టు చేసినట్లు బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు శుక్రవారం తెలిపారు. దివ్యాంగురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శృంగారపు ప్రసాద్ ఆచారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.


30, 31న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలు యథాతథం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 30, 31 సెలవు దినాలైనప్పటికీ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని డీఐజీ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కొనుగోలు, అమ్మకందారులు రిజిస్ట్రేషన్లు యథావిధిగా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు.

ఫిషరీస్ డీడీకి పదోన్నతి

అరసవల్లి: జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి.శ్రీనివాసరావుకు పదోన్నతి లభించింది. డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడేళ్లుగా శ్రీకాకుళం జిల్లాలోనే వివిధ హోదాల్లో శ్రీనివాసరావు విధులు నిర్వర్తించారు. తాజా పదోన్నతుల్లో ఈయనకు క్యాడర్ పెరగడంతో పాటు బదిలీ చేశారు. పలాసలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణకు జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది.

సమగ్ర విచారణకు డిమాండ్


జేసీకి వినతిపత్రం అందిస్తున్న సీసీఎస్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని క్రిస్టియన్ సెక్యూర్ సర్వీసెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బిషప్ బర్నబాస్ బింకం, ప్రధాన కార్యదర్శి బ్రదర్ ఒంపూరు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 24న తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ప్రవీణ్ మృతిచెందారని, దీనిపై పలు అనుమానాలు ఉన్నందున విచారణ జరిపి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని, క్రైస్తవుల రక్షణకు భద్రత కల్పించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో సీఎస్ఎస్ నాయకులు, పాస్టర్లు ఎం.షడ్రక్ బాబు, జి.శామ్యూల్ అరుణ్‌కుమార్, టి.పేతురు, ఇ.శామ్యూల్ జాన్, ప్రత్తిపాటి ప్రసాద్, ఎ.ఎ.పాల్, అల్లు ఇమ్మానుయేల్, ఆశిర్‌కుమార్, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో వేంకటేశ్వరస్వామి రూపాన్ని వేస్తున్న యువతి


ముగ్గుల పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్న మహిళలు


పార్టిసిపేషన్ బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు


మెహందీ వేసుకుంటున్న మహిళలు

ఉత్సాహంగా ఉగాది పోటీలు


మెహందీ పోటీల్లో పాల్గొన్న మహిళలు


పోటీలను ప్రారంభిస్తున్న రాఘవ కుముంధాన్, సంఘం నాయుడు

రాయగడ: స్థానిక తేజస్వీ ఓపెన్ గ్రౌండ్‌లో రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో ఈ నెల 30, 31 తేదీల్లో ఉగాది ఉత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వివిధ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ ప్రముఖులు రాఘవ కుముంధాన్, గౌరవ అతిథిగా సంఘం నాయుడు హాజరై పోటీలకు శ్రీకారం చుట్టారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే ఈ వేడుకలు గత 12 సంవత్సరాలుగా రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరావు రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట నిర్వహిస్తున్నారని కుముంధాన్ అన్నారు. అంతా ఏకమై ఉగాది సంబరాలను ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ ఏడాది కూడా ఆయన నేతృత్వంలో కొనసాగుతున్న వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పోటీలకు అనూహ్య స్పందన లభించిందని అన్నారు. మహిళల మధ్య ముగ్గులు, రంగోలీ పోటీల్లో ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గులు పోటీ..

తేజస్వీ ఓపెన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముగ్గులు, మెహెందీ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 91 మంది మహిళలు, చిన్నారులు తలపడ్డారు. నిర్వాహకులే రంగులను ఉచితంగా సరఫరా చేశారు. రాయగడ ప్రజల ఆరాధ్య దైవం మజ్జిగౌరి అమ్మవారు, వేంకటేశ్వరస్వామి ఆకృతులలో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి.

విజేతల వివరాలు..

ముగ్గుల పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో బిజయ లక్ష్మి., ఎం.మౌనిక, జె.గంగాలు గెలుచుకోగా.. భవానీ బిడిక, గాయత్రి, పి.వర్షాలు ప్రోత్సాహక బహుమతులు దక్కించుకున్నారు. అలాగే మెహెందీ పోటీల్లో మొత్తం 76 మంది మహిళలు పాల్గొనగా వీరిలో ప్రథమ బహుమతిని సాఫియా బెహర, ద్వితీయ బహుమతిని రాధారాణి కౌసల్య, తృతీయ బహుమతిని పి.వర్షితలు గెలుపొందగా సంజు పాఢి, వనితా పట్నాయక్, జె.గంగలు ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్నవారందరికీ నిర్వాహకులు పార్టిసిపేషన్ బహుమతులను అందజేశారు. కమిటీ సభ్యులు సుజాత పాలో, రోజా, షర్మిష్టా పాఢి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు ఉగాది సంబరాల్లో బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ముగ్గుల పోటీల విజేతలతో నిర్వాహకులు

ఉత్సాహంగా నాటక దినోత్సవం


మాట్లాడుతున్న రంగస్థల నటులు, దర్శకులు దేవేంద్రదాస్


రంగస్థల కళాకారులు మనోజ్ పాఢి

పర్లాకిమిడి: పట్టణంలోని కరణం వీధిలో విజయా క్లబ్‌లో ప్రపంచ నాటక దినోత్సవాన్ని ప్రగతి శీల నాట్యరంగస్థలం 'తరంగరంగ్' ఆధ్వర్యంలో సాధారణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తరంగరంగ సంస్థ అధ్యక్షులు దేవేంద్రదాస్ అధ్యక్షతన జరుగగా, క్రియేటివ్ ఆర్ట్స్ అధ్యక్షులు నృసింహచరణ్ పట్నాయక్, ఒడిశా సంగీత నాటక అకాడమి సభ్యులు రఘునాథ పాత్రో, రంగస్థల నటులు ఆదర్శదాస్ పాల్గొన్నారు. ఒడిశాలో గజపతిలో పర్లాఖిముండిలో రఘునాథ పోరిచ్చా నాటకం తొలుత ప్రదర్శించబడిందని దేవేంద్ర దాస్ అన్నారు. పర్లాకిమిడి మట్టిని ఏ రంగస్థల కళాకారులు మరిచిపోలేదన్నారు. రోజురోజుకు ఆదరణ తగ్గుతున్న రంగస్థల నాటక మండలిని ముందుకు నడిపించేందుకు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా నాటక మహోత్సవాలు జరుపుతామని ఆదర్శదాస్ అన్నారు. సమావేశంలో నాట్యకళాకారులు మనోజ్ పాఢి, మంచ్ అధినేత పృథ్వీరాజ్, కళాకారిణి మాతాంగినీ గురు, మమతా పాఢి, శుభాంశు శేఖర్ పట్నాయిక్, సత్య పాఢియారీ పాల్గొన్నారు.

కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఈశ్వర్ పాణిగ్రాహీ

కొరాపుట్: కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి కేంద్రంలోని గునయిపొడ ల్యాంప్స్ కార్యాలయంలో కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కొరాపుట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ రిబ్బన్ కత్తిరించి ఈ విభాగం ప్రారంభించారు. ఇందులో ఖాతాదారులకు 23 రకాల సేవలు అందనున్నాయి. వెనుకబడిన లమ్తాపుట్‌లో ఇటు వంటి సేవలు అందించడంపై ఈశ్వర్ పాణిగ్రాహీ హర్షం వ్యక్తం చేసారు.

మద్యం మత్తులో హల్‌చల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని మంగువారి తోటలో శుక్రవారం ఓ సస్పెక్ట్ షీటర్ మద్యం తాగి హల్‌చల్ సృష్టించినట్లు ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. బొమ్మలాట ఢిల్లీ అలియాస్ ఢిల్లీశ్వర రావు అనే యువకుడు శుక్రవారం ఉదయం మంగువారితోట బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి ఆ మైకంలో అక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగించాడని, వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి వెళ్లి అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

నేటినుంచి బ్యాడ్మింటన్ పోటీలు


వివరాలు వెల్లడిస్తున్న చరణ్ దాస్ తదితరులు

జయపురం: అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకూ అండర్-19 విభాగంగాలో బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని డీపీ అకాడమీ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సంబంధిత ప్రతినిధి నిమయి చరణ దాస్ వెల్లడించారు. ఈ పోటీలలో 94 మంది బాల బాలికలు పాల్గొంటారన్నారు. 15 మంది పర్యవేక్షిస్తారన్నారు. పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రలో పలు ప్రాంతాల నుంచి వచ్చే ఆటగాళ్లు, వారితో వచ్చిన సహాయకులకు వసతి, భోజన సౌకర్యాలు అకాడమి కల్పిస్తోందన్నారు. సమావేశంలో డీపీ అకాడమీ సభ్యులు దేవ దత్త దాస్, సుబ్రత కుమార్ పండ, గౌరీ పట్నాయక్ పాల్గొన్నారు.

స్పీకర్‌కు ఫిర్యాదు


లోక్ సభ స్పీకర్‌కి ఫిర్యాదు చేస్తున్న సప్తగిరి ఉల్కా

కొరాపుట్: పార్లమెంట్ సభ్యునిగా తనకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా లోక్‌సభ స్పీకర్‌కి ఫిర్యాదు చేశారు. శుక్ర వారం భారత పార్లమెంట్‌కి ఫిర్యాదు అందించారు. ఈ నెల 26వ తేదీన తాను ఒడిశాలోని భువనేశ్వర్‌లో అసెంబ్లీకి వెళ్తుండగా రిజర్వ్ ఆఫీసు వద్ద మూడు గంటల పాటు పోలీసులు దిగ్బంధించారన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడినని, తాను అసెంబ్లీకి వెళ్లడానికి అన్ని హక్కులు ఉన్నాయని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదన్నారు. ఇవి గౌరవ పార్లమెంట్ సభ్యునికి జరిగిన హక్కుల ఉల్లంఘనగా అభివర్ణించారు. ఆర్టికల్ 105, రూల్ 222 ప్రకారం ఇది ఎంతో నేరంగా పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి ఒడిశా భుబనేశ్వర్ డిసిపిలపై చర్యలు తీసుకోవాలని సప్తగిరి ఉల్కా విజ్ఞప్తి చేసారు.

మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రికి కాయకల్ప అవార్డు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ప్రభుత్వాస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సేవా రంగంలో అందిస్తున్న కాయాకల్ప పురస్కారం వరించింది. సమగ్ర మౌలిక వసతులు, మెరుగైన వైద్య సేవలు అందించినందుకు అవార్డు వరించింది. అలాగే మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి ఉపవిభాగ ఆస్పత్రికి 2024-25 సంవత్సరానికి ఉపవిభాగ ఆస్పత్రిల స్థాయిలో రాష్ట్రంలో రెండో స్థానం పొందింది. ఇందులో భాగంగా మల్కన్‌గిరి జిల్లా ప్రధాన ఆస్పత్రికి రూ. 50 లక్షలు, చిత్రకొండ ఉప విభాగానికి రూ. 10 లక్షలు నగదు బహుమతి కేటాయించారు. జిల్లా ప్రధాన వైద్యాధికారి, చిత్రకొండ ఉపవిభాగ ఆస్పత్రి అధికారి క్షీరోధ చంద్ర మహంతి అవార్డులను అందుకున్నారు.

పోక్సో చట్టంతో చిన్నారులకు రక్షణ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కె.ఎం.జామరుద్ బేగం

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారుల రక్షణకు పోక్సో చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని ఫస్ట్ అడిషనల్ జడ్జి కె.ఎం.జామరుద్ బేగం, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ తలే లక్ష్మణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ కమిటీ, జువైనల్ జస్టిస్ బోర్డు ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చట్టం ప్రకారం పిల్లలుగా పరిగణించబడతారని, బాధితులకు న్యాయ సహాయం అందించడం, వారి గుర్తింపును రహస్యంగా ఉంచడం, సురక్షితమైన వాతావరణాన్ని అందించడం చట్టం ముఖ్య ఉద్దేశమని వివరించారు. తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష సైతం విధించే అవకాశం ఉందని చెప్పారు. పిల్లలకు మంచి చెడులను వివరించడం, వారికి అవగాహన కల్పించడం సమాజం బాధ్యతని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కంచిలి: మండలంలోని జాడుపూడి పంచాయతీ బసవపుట్టుగ పరిధిలో మర్రిచెట్టు ఊడలకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని మృతుని కుటుంబీకులు, గ్రామస్తులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కవిటి మండలం సహలాలపుట్టుగ పంచాయతీ ముల్లు వీధికి చెందిన తుపాకీ కూర్మారావు(43)గా గుర్తించారు. మద్యానికి బానిసైన ఈ వ్యక్తి భార్యతో గొడవలు పడుతూ సుమారు 20 ఏళ్లుగా విడిగానే జీవిస్తున్నాడు. మృతుని సోదరుడు దీనబంధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల వేతనాల్లో కోత తగదు


పీడీ శాంతిశ్రీకి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఫేస్‌యాప్ పేరుతో అంగన్‌వాడీల వేతనాలలో కోత విధించవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ - హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల తల్లులకు ప్రతినెలా ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలన్న ఆదేశాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అధికారులు ఒత్తిడి, వేతనాలలో కోత మానుకోవాలన్నారు. ఇప్పటికే యాప్ మొరాయిస్తోందని, ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయడం లేదని చెప్పారు. అయినప్పటికీ ఎన్నో అవస్థలు పడి పని పూర్తి చేస్తుంటే మరింతగా పనిభారం పెంచడం తగదన్నారు. వేతనాల కోత, మెమోల జారీతో తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎస్.హైమావతి, వి.హేమలత, జె.కాంచన, డి.మోహిని, పి.బాలేశ్వరి, ఎల్.దుర్గ పాల్గొన్నారు.

యూడీఐడీ.. 21 సేవలు రెడీ



- దివ్యాంగులకు ఆధార్ తరహాలో ప్రత్యేక నంబర్
- కొత్తపోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్రం
- ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా సులువుగా సేవలు పొందే అవకాశం
- ప్రయాస లేకుండా రైల్వేపాస్ పొందే సదుపాయం

నరసన్నపేట:

దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, ఇతర ప్రయోజనాలు, సదరం శిబిరాల సమాచారం తదితర సేవలను సులభంగా పొందేందుకు యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ) అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పోర్టల్ దివ్యాంగులకు వరంలా మారనుంది. ఈ పోర్టల్ ద్వారా పొందిన ఐడీ నంబర్ ఆధారంగా దివ్యాంగులు రైల్వే పాస్‌లను కూడా పొందవచ్చు. గతంలో సదరం సర్టిఫికెట్లు పొందాలంటే స్లాట్ బుకింగ్ కోసం మీ-సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇకపై యూడీఐడీ నంబర్ ద్వారా దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే శ్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు.

యూడీఐడీ పొందాలంటే..

హెచ్‌టీటీపీ://ఎస్‌డబ్ల్యూఏవీఎల్ఏఎంబీఏఎన్‌సీఏఆర్‌డీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా దివ్యాంగులు నేరుగా ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీ-సేవా కేంద్రాల నుంచే కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సులభతరంగా సేవలు..


- కొత్తగా అందుబాటులోని తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ ద్వారా సేవలు సులభతరం కానున్నాయి. సదరం శిబిరాల కోసం మీ సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. వైద్యపరీక్షలకు ఎప్పుడు హాజరు కావాలనే సమాచారం దివ్యాంగుల ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సమాచారం రూపంలో వస్తుంది. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో తప్పులు, అక్షరదోషాలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది.
- ఇప్పటి వరకూ ఐదు రకాల సేవల వైకల్యం ఉన్న వారికే ఈ-సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండేది. ఇక యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల సేవల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు కూడా సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- శిబిరంలో వైకల్య నిర్ధారణ పూర్తయ్యాక స్మార్ట్‌కార్డును పోస్టల్ శాఖ ద్వారా ఇంటికే పంపిస్తారు. ఈ కార్డు పింఛన్‌తో పాటు రైల్వేపాస్‌లు, ఇతర సంక్షేమ పథకాలకు దేశ వ్యాప్తంగా చెల్లుబాటు కానుంది.
- యూడీఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకొనే అవకాశం కేంద్రం కల్పించింది. ఇప్పటి వరకూ సదరం సర్టిఫికెట్ మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అయ్యేవి.


కేంద్ర ప్రభుత్వం అందుబాటులోనికి తెచ్చిన పోర్టల్

దరఖాస్తు ఇలా..

ఆన్‌లైన్‌లో స్వాలంబన్‌కార్డు.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియ సంబంధించి కొన్ని సూచనలు ఉంటాయి. వాటిని పూర్తిగా చదివి అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే దరఖాస్తు ఫారం ఓపెన్ అవుతుంది. అడిగిన సమాచారం నమోదు చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షలు అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకోవచ్చు.

దివ్యాంగులకు వరం..



దివ్యాంగులకు ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీని ప్రవేశపెట్టింది. పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని ఐడీ నంబర్ పొందవచ్చు. ప్రత్యేక కార్డు కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందాలన్నా ఈ కార్డు తప్పనిసరి కానుంది.

– కె.కవిత, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ, శ్రీకాకుళం

క్లుప్తంగా

పోలీస్ సిబ్బంది సమస్యలకు ఒకరోజు

● వెల్ఫేర్‌డేలో విజ్ఞాపనలు స్వీకరించిన ఎస్పీ



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న అనుభవిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపించనున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డేను ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందల్ విజ్ఞాపనలు స్వీకరించి చర్యలు చేపట్టారు.

లివిరి సమీపంలో ఏనుగుల గుంపు



తోటలో ప్రవేశించిన ఏనుగుల గుంపు

భామిని: మండలంలో ఏనుగుల గుంపు అలజడి సృష్టిస్తోంది. శుక్రవారం మండలంలోని లివిరి పంట పొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు ప్రవేశించి పంటలు నాశనం చేస్తున్నాయి. వంశధార నదీ తీరం వెంబడి ఏనుగుల గుంపు ప్రయాణం కొనసాగుతోంది. భామిని గ్రామంలోకి ఏనుగుల గుంపు ప్రవేశిస్తుందని మండల కేంద్రం రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఏనుగుల గుంపు పంటలన్నీ పాడుచేస్తున్నప్పటికీ అధికార కూటమి నాయకులు ఇచ్చిన హామీ మరిచి మౌనం వహించడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పిచ్చి కుక్క కరిచి 9 మందికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన వ్యక్తులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని బార్నాలవీధి రోడ్డులో శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో జనం భయంతో పరుగులు తీశారు. ఆ వీధిలో నడుచుకుంటూ వచ్చిన 9 మందిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో వారంతా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కోట శ్రీరాములు, జి.నాగరాజు, ఎం.ధరణి, సుజాత, జి.పార్వతి, పి.రామిశెట్టి, కె.గంగులు, బి.ధర్మారావు, కె.రవి ఉన్నారు. వారందరికీ వీరఘట్టం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. వారిలో నలుగురికి తీవ్రంగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడు మృతి



కార్తీక్ మృతదేహం

వేపాడ: మండలంలోని కొత్త బొద్దాం జంక్షన్‌లో గురువారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా నలుగురు గాయాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట నుంచి ఎల్.కోట వైపు ద్విచక్ర వాహనం వెళ్తుండగా ఎల్.కోట నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్న మరో ద్విచక్రవాహనం కొత్త బొద్దాం జంక్షన్ దగ్గర ఢీకొన్నాయి. దీంతో ప్రమాదంలో రెండు వాహనాలపై ఉన్న ఐదుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఎస్.కోట నుంచి ఎల్.కోట వైపు వెళ్తున్న వాహనచోదకుడు బసవబోయిన కార్తీక్ (19) మృతిచెందాడు. ఎస్.కోట కోటవీధికి చెందిన కార్తీక్‌కు తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.దేవి తెలిపారు.

30, 31 తేదీల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు

పార్వతీపురంటౌన్: ఈ నెల 30న ఉగాది, 31న రంజాన్ పండగ సెలవురోజుల్లో జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో యథావిధిగా సేవలందిస్తామని జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్ తెలిపారు. జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. సెలవు రోజున కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసినందుకు ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయమని తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి యూఎల్ఆర్ స్లాట్ బుకింగ్ అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇదీ యంత్రాంగం తీరు..!

● కూటమి నేతల సిఫారసు ఉంటేనే వ్యవసాయ యంత్రాల మంజూరు
● కూటమి ఆదేశాలు అధికారులు అమలు చేస్తున్నారనే ఆరోపణలు



ట్రాక్టర్‌తో నడిచే దుక్కి సెట్టు



పవర్ టిల్లర్

విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రంధి దేముడు. ఈయనది గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామం. వ్యవసాయ యంత్ర పనిముట్లు రాయితీపై ఇస్తామని రైతు సేవా కేంద్రం సిబ్బంది చెప్పడంతో దుక్కిసెట్టు కోసం దరఖాస్తు చేశాడు. దుక్కిసెట్టు నిమిత్తం రైతు కట్టాల్సిన వాటాను చెల్లించడానికి రైతు సేవా కేంద్రం సిబ్బందిని అడిగితే మీకు దుక్కి సెట్టు మంజూరు చేయలేం అని తేల్చి చెప్పడంతో మిన్నుకుండిపోయాడు. ఈ పరిస్థితి ఈ ఒక్క రైతుదేకాదు. జిల్లాలోని అనేక మంది రైతులది. అందరికీ అన్నం పెట్టే రైతులతో కూటమి నేతలు రాజకీయాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసిన రైతులు ఏపార్టీ వారా? అని ఆరా తీస్తున్నారు. కూటమి పార్టీకి చెందిన రైతులైతే వారికి యంత్ర పరికరాల మంజూరుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. తటస్థంగా ఉండే రైతులైతే వారికి యంత్ర పరికరాలు మంజూరు చేయవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కూడా అధికార పార్టీకి చెందిన నేతల ఆదేశాలను తు.చ తప్పకుండా అమలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీకు తెలియంది ఏం ఉంది? అధికార పార్టీ నేతలు చెప్పినట్లు చేయాల్సిందే కదా అంటూ వ్యవసాయ శాఖకు చెందిన ఓ అధికారి వాఖ్యానించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కూటమి నేతల వ్యవహార శైలి తెలిసిన చాలామంది రైతులు యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేయలేదు. దరఖాస్తు చేసినా కూటమి నేతలు మంజూరు కానివ్వరనేది రైతుల భావన.

456 మంది దరఖాస్తు

వ్యవసాయ యంత్ర పరికరాల కోసం రైతులు జిల్లా వ్యాపంగా 456 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వాటికి సంబంధించి కూటమి నేతలు చెప్పిన లబ్ధిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేసినట్లు తెలిసింది. 50 శాతం రాయితీపై యంత్ర పరికరాలు ఇవ్వనున్నారు. దుక్కి సెట్లు, మోటార్ స్ప్రేయర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్‌వీటర్స్, రోటోవీడర్స్ యంత్ర పరికరాలు ఇవ్వనున్నారు. వ్యవసాయ యంత్ర పరికరాల రాయితీకి సంబంధించి ప్రభుత్వం జిల్లాకు రూ.2.50 నిధులు కేటాయించినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు

దరఖాస్తులు పరిశీలించి మంజూరు



జిల్లాలో యంత్ర పరికరాల కోసం 456 మంది దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తులను పరిశీలించి యంత్ర పరికరాలు మంజూరు చేయనున్నాం.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రతి విద్యార్థి వివరాలు పక్కాగా ఉండాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి సంబంధించిన వివరాలు పక్కాగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు విద్యాశాఖపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. బడిఈడు పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండాలని స్పష్టం చేశారు. పిల్లలు బడిబయట ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వారి కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలపై వివరాలు ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్యార్థుల్లో మృతులు ఉంటే వాటి వివరాలు, విశ్లేషణతో సహా ఉండాలని చెప్పారు. పాఠశాలలలో లభ్యంగా ఉన్న మౌలిక వసతులు వివరాల నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయ-తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని, అర్థవంతమైన చర్చలు జరగాలని అన్నారు. సీఆర్‌పీల పనితీరు మెరుగుపడాలని సూచించారు.

వచ్చే విద్యా సంవత్సరంలో స్పష్టమైన ప్రమాణాలు

ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు విధిగా ఉండాలని, అందుకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే వ్యవస్థ పటిష్టంగా పనిచేయాలని కోరారు. ప్రఇ విద్యార్థి భాషా నైపుణ్యం, గణితంలో నాలుగు అంశాలలో స్పష్టమైన పరిజ్ఞానం కలిగి ఉండాలని అందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరింత పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి భవిత కార్డు జారీ చేయాలని, పౌష్టికాహారాన్ని అందించేందుకు మనబడి, మనతోట కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈవో డా.ఎన్‌టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

వేసవి వేడిమి దృష్ట్యా చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. వేసవి వేడిమి, తగితర అంశాలపై మండల స్థాయి అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం ఇందుకోసం తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీ-4 సదస్సులో భాగస్వాములు కావాలి

జీరో పావర్టీ పీ-4 ప్రారంభోత్సవ సదస్సులో జిల్లా పౌరుల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్(పీ-4) సదస్సుకు జిల్లా పౌరుల భాగస్వామ్యంపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు.

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి



శాశ్వత లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: శాశ్వత లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటే ఇరుపార్టీలకు మేలు చేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఉత్తర్వుల మేరకు శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో పారాలీగల్ వలంటీర్స్‌కు, శాశ్వత లోక్ అదాలత్ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి జి.దుర్గయ్య మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో వ్యాజ్యం వేయడం వల్ల ఎటువంటి కోర్టు ఫీజు ఉండదన్నారు. దీనిమీద తీర్పు చెప్పనున్నారని, ఇక్కడ తీర్పు చెప్పిన మీదట దానికి అపీల్ ఉండదని స్పష్టం చేశారు. హాజరైన పారా లీగల్ వలంటీర్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ వలంటీర్స్ అందరూ శాశ్వత లోక్ అదాలత్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, శాశ్వత లోక్ అదాలత్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఏకగ్రీవం



ఎన్నికైన నూతన బార్ అసోసియేషన్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవమ య్యాయి. ఈ మేరకు అధ్యక్షుడిగా నల్ల శ్రీనివాసరావు ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి బి.సత్యనారాయణ శుక్రవారం పేర్కొన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు పార్వతీపురం బార్ అసోసియేషన్‌కు 2025-26 సంవత్సరానికి గాను ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. ఈ నెల 17 నామినేషన్ వేసిన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా సూర్ల కృష్ణ, జనరల్ సెక్రటరీగా నీలం రాజేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ఎంపీ వెంకట రాఘవేంద్ర, కోశాధికారిగా మంత్ర పూడి వెంటకరమణలను ఎన్నుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు.



అధ్యక్షుడు రవిబాబు



సంయుక్త కార్యదర్శి సీతారామరాజు

విజయనగరంలో..

విజయనగరం లీగల్: విజయనగరం జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘం ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. సంఘం అధ్యక్షుడిగా కలిశెట్టి రవిబాబు, సంయుక్త కార్యదర్శిగా బార్నాల సీతారామరాజు ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రవిబాబు 58 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి ధవళ వెంకట రావుపై విజయం సాధించారు. కాగా సంయుక్త కార్యదర్శిగా బార్నాల సీతారామ రాజు తన ప్రత్యర్థి సారిక సతీష్‌పై కేవలం నాలుగు ఓట్లు స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శిగా నలితం సురేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా పి.శివప్రసాద్, కోశాధికారిగా కళ్ళింపూడి వెంకట్రావు, లైబ్రరీ కార్యదర్శిగా తాడిరాజు, స్పోర్ట్స్ సెక్రటరీగా చిన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

3న జెమ్స్‌లో అవగాహన సదస్సు

శ్రీకాకుళం రూరల్: వైద్య ఆరోగ్య రంగాల్లో నైపుణ్యాలు- ఉద్యోగ అవకాశాలపై జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో ఏప్రిల్ 3న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ముఖ్య అతిథిగా కిమ్స్ గ్రూప్ ఆఫ్ చైర్మ న్, ఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావాలని, పూర్తి వివరాలకు 7680945357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చీపురుపల్లిలో చోరీ

చీపురుపల్లి: పట్టణంలోని కొత్త గవిడివీధిలో గల సిద్ధార్థ పాఠశాల ఎదురుగా నివాసం ఉంటున్న ఎర్నేని లక్ష్మణరావు, రాణి శ్రీ దంపతుల నివాసంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంటిలో వారు ఉన్నప్పటికీ అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో ఆరుగురు దుండగులు ప్రధాన గేటును విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. అయితే వారు నిద్రిస్తున్న గదిని మినహాయించి మిగిలిన ఇల్లంతా జల్లెడపట్టారు. ఈ నేపథ్యంలో రూ.25 వేల నగదు, అర కేజీ వెండి, రెండు మొబైల్ ఫోన్లు ఇతర సామగ్రి దొంగిలించినట్లు లక్ష్మణరావు తెలిపారు. దీంతో బాధితుడు లక్ష్మణరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా దుండగులు చోరీ కోసం ఆ ఇంటికి వెళ్తున్న వీడియోలను సిద్ధార్థ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చిత్రీకరించాయి. ఆ వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో ఒక ఇంటిలో టీవీ చూస్తూ ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై యు.మహేష్ శుక్రవారం తెలిపారు. బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.90,500 నగదుతో పాటు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లో ఉన్న బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి మరో ఐదుగురు వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలును నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా ఎస్సై యువతకు సూచించారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం ఏదూరువలస గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎప్పుడూ తాగుతూ ఉంటే పిల్లల భవిష్యత్తు ఏమిటని భార్య మందలించడంతో మనస్తాపం చెంది మేకలు, గొర్రెలకు వాడిన మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనం ద్వారా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అలాగే జియమ్మవలస మండలం బాసంగి గ్రామానికి చెందిన జి.నరసింహ నాయుడు మోటారు మెకానిక్. అతనికి అదే గ్రామానికి చెందిన అమ్మాయితో నిశ్చితార్థం జరిగి ముహూర్తం ఖరారైంది. ఆ అమ్మాయి నర్సింగ్ కోర్సు చదువుతోంది. అప్పుడే పెళ్లి చేసుకోను ఇంకా చదువుతాను అని అమ్మాయి అనడంతో మనస్తాపం చెంది తోటపల్లి బ్యారేజీ వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లుగా తెర్లాం యువకులు

● చిన్నయ్యపేటకు చెందిన జ్యోతిస్వరూప్
● తెర్లాంకు చెందిన హరీష్ ఎంపిక

తెర్లాం: జిల్లాలోని తెర్లాం మండలం, తెర్లాం పంచాయతీ పరిధిలోని చిన్నయ్యపేట గ్రామానికి చెందిన చింత జ్యోతిస్వరూప్, తెర్లాం మండల కేంద్రానికి చెందిన చిప్పాడ హరీష్‌లు ఇటీవల జరిగిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచి సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికయ్యారు. ఆ యువకుల నేపథ్యం ఇలా ఉంది.

చింత జ్యోతిస్వరూప్:.



చింత జ్యోతి స్వరూప్

చిన్నయ్యపేట గ్రామానికి చెందిన చింత శంకరరావు, అరుణల కుమారుడు. విశాఖపట్నంలోని గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. ఇటీవల జరిగిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలో 390 మార్కులకుగాను 350 మార్కులు సాధించి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 836వ ర్యాంక్ సాధించి సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. జ్యోతిస్వరూప్ తండ్రి శంకరరావు విశాఖపట్నంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో రీజనింగ్ ఫ్యాకల్టీగా పనిచేస్తుండగా తల్లి అరుణ గృహిణి. కుమారుడు జ్యోతిస్వరూప్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపిక కావడంపట్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిప్పాడ హరీష్..



చిప్పాడ హరీష్

తెర్లాం గ్రామానికి చెందిన చిప్పాడ రమణ, మంగరత్నంల కుమారుడు. హరీష్ ప్రస్తుతం చెన్నైలో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో టాక్స్ అసిస్టెంట్‌గా ఏడాదిన్నగా పనిచేస్తున్నాడు. ఇటీవల జరిగిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ ప్రవేశ పరీక్షకు హాజరై 390మార్కులకుగాను 346మార్కులు సాధించి ఆలిండియా ఓబీసీ కేటగిరీలో 1602 ర్యాంక్ కైవసం చేసుకుని సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. హరీష్ తండ్రి రమణ మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి మంగరత్నం తెర్లాంలోని శ్రీవేంకటేశ్వర విద్యాసంస్థల కరస్పాండెంట్. కుమారుడు హరీష్ సెంట్రల్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపిక కావడంపట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మెరకముడిదాం: మండలంలోని చినపూతికవలస గ్రామం పరిసరాల్లో ఉన్న మామిడితోటలో పేకాటశిబిరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేయడంతో పాటు, రూ.21,600 నగదు, మూడు అండ్రాయిడ్ ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు బుదరాయవలస ఎస్సై జె.లోకేశ్వరరావు తెలిపారు. అరెస్ట్‌చేసిన ఆరుగురిని రిమాండ్ తరలించనున్నట్లు చెప్పారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: విజయనగరం పట్టణంలోని గోకపేటలో ఐదేళ్ల క్రితం దిశ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసు విచారణ అనంతరం ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపిన ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన 16 ఏళ్ల బాలికతో గోకపేటకు చెందిన కంది సన్యాసిరావు అలియాస్ సిద్దు (19) అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. ఆపై ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తరచూ తన ఇంటికి తీసుకువెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలికను గర్భవతిని చేసి, చివరకు పెళ్లికి నిరాకరించడంతో తనను మోసం చేసినట్లు విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధిత బాలిక ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి మహిళా స్టేషన్ ఎస్సై బి.స్వర్ణలత పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దిశ మహిళా స్టేషన్ డీఎస్పీ టి.త్రినాథ్ ర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితుడిపై కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానారావు, ఇతర పోలీస్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

సారా దుష్ఫలితాలపై అవగాహన

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సారా తాగితే అధోగతి, తాగకుంటే పురోగతి అని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. సారా నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎక్సైజ్ అధికారులతో నవోదయం 2.0పై శుక్రవారం విజయనగరంలోని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా రహిత గ్రామాలు స్వర్ణాంధ్ర సాధనకు సోపానం కావాలన్నారు. సారా మానేద్దాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. సారా సరఫరాదారుల ఆటకట్టించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో విజయనగరం జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.

సమావేశంలో చర్చించిన అంశాలు....

- సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.
- సారా కేసుల్లో నిందితులు, అనుమానితులపై బైండోవర్‌లు పెట్టాలి. ముద్దాయిలపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టాలి.
- సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.
- గ్రామం, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలి.
- ప్రతి గ్రామాన్ని సారారహిత గ్రామంగా తీర్చిదిద్దాలి.
- ఒడిశా అధికారులతో సంప్రదించి సరిహద్దులో సంయుక్తంగా దాడులు నిర్వహించాలి.
- పార్వతీపురం, పాలకొండ, కురుపాం ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో నాటుసారాపై ప్రత్యేక దృష్టి సారించాలి.

ట్రాక్టర్ ఇంజిన్ కింద పడి వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో పోలిరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి రూరల్: మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధి కేశాయవలస గిరిజన గ్రామంలో టేకు మొక్కలకు నీళ్లుపోస్తున్న వాటర్ ట్యాంకు ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాక్టర్ ఇంజిన్ కింద పడి, పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశీపేట గ్రామానికి చెందిన పెదిరెడ్డి పోలిరాజు(58)మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కేశాయవలస గ్రామానికి చెందిన కొండగొర్రె నీలమ్మ పొలంలో టేకు మొక్కలకు నీళ్లు పోసేందుకు వాటర్‌ట్యాంకర్‌తో వెళ్తున్న పోలిరాజు పొలంలో ఎత్తుపల్లాలను గమనించకపోవడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పోలిరాజు ట్రాక్టర్ కింద పడగా అక్కడికక్కడే మృతిచెందాడని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు. మృతుడి కుమారుడు సూర్యానారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించామని సీఐ తెలిపారు.మృతుడు పోలిరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి..



మువ్వల జయరాం (ఫైల్)

భామిని: మండలం పసుకుడికి చెందిన ఇంటర్‌మీడియట్ విద్యార్థి మువ్వల జయరాం(18) శుక్రవారం శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడినట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల జయరాం ఇంటర్‌మీడియట్ సెకెండియర్ పరీక్షలు భామినిలో రాశాడు. పరీక్షల అనంతరం సరదాగా గడుపుతున్న జయరాం ఈ నెల 2న పసుకుడి నుంచి లివిరి డోలోత్సవ యాత్రకు స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంజరిగి తీవ్రగాయాలపాలయ్యడు. వెంటనే 108 అంబులెన్సు లో కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించి శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బత్తిలి ఏఎస్సై కొండగొర్రి కాంతారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు సోదరీమణులు ఉన్నారు. పసుకుడిలో జరిగిన అంతిమ సంస్కారంలో తోటి విద్యార్థులు, టీచర్లు, బంధువులు పాల్గొని జయరాంకు ఘనంగా నివాళులు అర్పించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి..



చెట్టుకు వేలాడుతున్న మృతదేహం

సాలూరు రూరల్: మండలంలోని మర్రివానివలస గ్రామానికి చెందిన వాకాటి ఐశ్వర్య (20) చీపురువలస గ్రామస మీపంలో మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన చెప్పిన సమాచారం ప్రకారం విశాఖపట్నంలోని ఒక బట్టల షాపులో పనిచేస్తున్న ఆమె ఇటీవల ఇంటికి వచ్చి రెండు రోజుల క్రితం పనికి వెళ్లింది. శుక్రవారం చీపురువలస గ్రామసమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షయ నిర్ధారణ పరీక్షల్లో దేశంలోనే జిల్లా టాప్

● వైద్యారోగ్యశాఖను అభినందించిన కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం ఫోర్ట్: క్షయవ్యాధి నియంత్రణలో విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. క్షయ వ్యాధి నియంత్రణ ప్రత్యేక వందరోజుల ఉద్యమంలో దేశంలోనే అత్యధిక క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసిన జిల్లాగా గుర్తింపు పొందింది. క్షయవ్యాధి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం దేశంలోని 347 జిల్లాల్లో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని గత ఏడాది డిసెంబర్ 7న ప్రారంభించింది. ఈ ఉద్యమంలో భాగంగా రాష్ట్రంలో విజయనగరం జిల్లా వంద రోజుల టీబీ నియంత్రణ కార్యక్రమానికి ఎంపికైంది. దీనిలో భాగంగా క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, క్షయవ్యాధి లక్షణాలు కలిగి ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు జిల్లాలో చేపట్టారు. వంద రోజుల కార్యక్రమానికి ఎంపికైన 347 జిల్లాల అన్నింటిలో విజయనగరం జిల్లాలో అత్యధికంగా 45,195 క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్లడించారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా మార్చి 24న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ జేపీ నడ్డా నుంచి క్షయ నియంత్రణపై విజయనగరం జిల్లాకు చెందిన కేంద్ర బృందం ప్రతినిధి పి.రమేష్ అవార్డు స్వీకరించారని తెలిపారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి, క్షయ నివారణ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.